


డ్రోన్ల ఎగురవేత నిషేధం
ప్రధాని మోదీ పర్యటన పరిసర ప్రాంతాల్లో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు డ్రోన్ల ఎగురవేతపై జిల్లా పోలీసు శాఖ నిషేధం విధించింది.
8లో▸



ట'మాట' పడిపోయింది!
టమాటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పిన మాటలు ఉత్తివే అని తేలిపోయింది. సోమవారం కిలో రూ. 1 నుంచి రూ.2 ప్రకారమే కొనుగోలు చేశారు.
8లో▸



సౌకర్యాలు కల్పిస్తారా?
శ్రీశైల దేవస్థానానికి నూతన ధర్మకర్తల సలహా మండలి ఏర్పాటైంది. మండలి సభ్యులు సలహాలే ఇస్తారా.. సౌకర్యాలు కల్పిస్తారా అనే అనుమానాలు ఉన్నాయి.
8లో▸

నకిలీ మద్యంపై జనాగ్రహం!

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
- ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట నిరసనలు
- తరలి వచ్చిన మహిళలు, ప్రజలు, పార్టీ శ్రేణులు
- నకిలీ మద్యంపై సీబీఐతో విచారణ చేయాలని డిమాండ్
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపాటు



కర్నూలు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ నేతలు, మహిళలు

నంద్యాల: నకిలీ మద్యాన్ని తయారు చేసి రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్న టీడీపీ నాయకుల తీరు, కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనకు మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. 'నారా వారి నకిలీ మద్యం వద్దు.. ప్రజల ప్రాణాలే ముద్దు' అంటూ మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, బనగానపల్లె, నందికొట్కూరు నియోజకవర్గ కేంద్రాల్లో నకిలీ మద్యం అమ్మకాలను అరికట్టాలని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసనలు నిర్వహించారు. నకిలీ మద్యం అమ్మకాలు ఆపి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతూ జిల్లా కేంద్రం నంద్యాలలో నూనెపల్లె నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి గంట పాటు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. సీఎం డౌన్.. డౌన్.. నారా వారి నకిలీ మద్యం వద్దు.., విచ్చలవిడి మద్యం అమ్మకాలను అరికట్టాలి.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తికి వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికళారెడ్డిలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల బట్టబయలైన నకిలీ మద్యం తయారీ, సరఫరా చూస్తే ప్రజల్లో ఆందోళన కలుగుతుందన్నారు. కేవలం స్పిరిట్, రసాయనాలతో తయారు చేసి, పాపులర్ బ్రాండ్‌లను తలపించేలా బాటిళ్లపై నకిలీ లేబుల్స్ అతికించి యథేచ్ఛగా సరఫరా చేస్తూ అమ్ముతున్నారంటే వారి వెనుక టీడీపీ నాయకులు ఉన్నారని అందరికీ అర్థమవుతుందన్నారు. నకిలీ మద్యం గుట్టు పూర్తిగా తేల్చేందుకు ఈ కేసును దమ్ముంటే సీబీఐకి కూటమి ప్రభుత్వం అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లూరి రామలింగారెడ్డి, అనిల్ అమృతరాజ్, రసూల్ ఆజాద్, తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తికి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

➤ ఆళ్లగడ్డలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నకిలీ మద్యంపై నిరసన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు పట్టణంలోని మహిళా కార్యకర్తలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడ దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం ర్యాలీగా ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని ఎక్సైజ్ అధికారికి వినతి పత్రం అందజేశారు.

➤ నారావారి నకిలీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బనగానపల్లెలో నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని తిరుపాల్‌రెడ్డి ఇంటి వద్ద నుంచి బస్టాండ్ సమీపంలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్ ఎస్‌ఐ కమలాకర్‌కు వినతి పత్రం అందజేశారు. కల్తీ మద్యంపై విచారణను రాష్ట్ర ప్రభుత్వం సిట్ అధికారులతో కాకుండా సీబీఐకి అప్పగించాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు.

➤ నకిలీ మద్యం అమ్మకాలను నిరసిస్తూ నందికొట్కూరులో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పటేల్ సెంటర్ నుంచి ఎక్సైజ్ శాఖ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వ తీరును అడుగడుగునా ఎండగట్టారు. మద్యం సీసాలు పగులగొట్టి నిరసన వ్యక్తం చేశారు.



నందికొట్కూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డాక్టర్ దారా సుధీర్, పార్టీ శ్రేణులు

కర్నూలులో కదంతొక్కిన మహిళలు

వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు కార్పొరేషన్ మేయర్ బీవై రామయ్య ఆధ్వర్యంలో సోమవారం కర్నూలులో మహిళలు కదం తొక్కారు. పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కోట్ల సర్కిల్ (పాత కంట్రోల్ రూమ్) వద్ద నుంచి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వరకు పార్టీ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. 'నకిలీ మద్యంతో ప్రాణాలు తీస్తున్న కూటమి ప్రభుత్వం' అంటూ భారీ బ్యానర్ చేత పట్టి ఎన్-బ్రాండ్ లిక్కర్‌ను అరికట్టాలంటూ నినాదాలు చేశారు. డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట దాదాపు రెండు గంటల పాటు బైఠాయించారు. ప్రజల ప్రాణాలు హరిస్తున్న టీడీపీ నాయకుల వైఖరి, కూటమి ప్రభుత్వం మద్యం విధానానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎక్సైజ్ కార్యాలయం గేటు వద్ద మద్యాన్ని పారబోసి నిరసన తెలియజేశారు. అనంతరం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పల్లెల్లో బెల్టు షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఏఈఎస్‌ను నాయకులు నిలదీశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు శివారెడ్డి, హనుమంత రెడ్డి, కార్పొరేటర్లు చిట్టెమ్మ, అరుణ, లక్ష్మిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➤ ఆత్మకూరు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, సయ్యద్ మీర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్ ఎస్‌ఐ వీరస్వామికి వినతి పత్రం అందజేశారు.

సీబీఐతో విచారణ చేయించాలి



ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోంది. రాష్ట్రంలో వెలుగుచూసిన భారీ నకిలీ మద్యం రాకెట్ వ్యవహారంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పాత్ర ఉందని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారు. నకిలీ మద్యంపై సిట్ చేత దర్యాప్తు చేయిస్తామని చంద్రబాబు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. చిత్తశుద్ధి ఉంటే సీబీఐ చేత విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. – కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు

ప్రజల ప్రాణాలతో చెలగాటమా..



టీడీపీ నాయకులు డబ్బు కక్కుర్తి కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నకిలీ మద్యాన్ని తయారు చేసి దర్జాగా అమ్ముతున్నా పట్టించుకునేవారు లేరు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కనీసం బెల్ట్‌షాప్‌లు కూడా ఉండేవి కావు. ఇప్పుడు ఏ ఊరు చూసినా నకిలీ మద్యం, బెల్ట్ షాపులే కనిపిస్తున్నాయి. నకిలీ మద్యం గుట్టు వీడాలంటే సీబీఐతో దర్యాప్తు చేపట్టాల్సిందే. – గంగుల బిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే

నాణ్యమైన మద్యమంటే నకిలీనా..



ఎన్నికల ముందు కూటమి నేతలు నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామని చెప్పి ఇప్పుడు నకిలీ మద్యాన్ని ప్రజలకు అంటగడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం రాష్ట్రంలో ఏరులై పారుతుంది. నకిలీ మద్యం గుట్టు పూర్తిగా వీడాలంటే రాష్ట్ర వ్యాప్తంగా వైన్‌షాపులు, బార్‌లు, బెల్ట్ షాపుల్లో ఎక్సైజ్ శాఖ తనిఖీలు చేయాల్సిందే. – దారా సుధీర్, వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు ఇన్‌చార్జ్

➤ నకిలీ మద్యం అమ్మకాలపై వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపు మేరకు డోన్ పట్టణంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పార్టీ వాలంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్, జెడ్పీటీసీలు బద్దుల రాజకుమార్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు సోమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ నేతల బైకు ర్యాలీ



డోన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు



ఆళ్లగడ్డ: ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

న్యూస్‌రీల్

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు



ఖైదీల సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు: న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి అన్నారు. సోమవారం పట్టణంలోని సబ్‌జైల్‌ను జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. సబ్‌జైల్‌లో సమస్యలుంటే న్యాయవాదుల దృష్టికి, ఆన్‌లైన్ నెంబరు 15100 ద్వారా కంప్లయింట్ చేయవచ్చని స్పష్టం చేశారు. 70 ఏళ్లకు పైబడిన వారు ఎవరైన ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజన వసతుల గురించి ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సదుపాయల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, ఉచిత న్యాయవాది మద్దయ్య, మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

86 రోజులకు రూ. 63.84 లక్షల ఆదాయం



కానుకలు లెక్కిస్తున్న సేవకులు

మహానంది: భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు మహానందీశ్వరుడికి 86 రోజులకు రూ. 63,84,938 ఆదాయం లభించినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక అభిషేక మండపంలో సోమవారం హుండీ కానుకలను లెక్కించారు. శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారితో పాటు మిగిలిన ఆలయాల ద్వారా రూ. 62,81,323, అన్నప్రసాద విభాగం ద్వారా రూ. 78,050, గోసంరక్షణ హుండీ ద్వారా రూ. 25,565 వచ్చిందన్నారు. వీటితో పాటు రెండు అమెరికా డాలర్లు వచ్చాయన్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి, ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్లు శశిధర్‌రెడ్డి, నీలకంఠేశ్వరరాజు, పి.సుబ్బారెడ్డి, బాలాజీ సేవాట్రస్ట్, తిరుమల బాలాజీ సేవా సమితి, భ్రమరాంబ సేవా సమితి, శ్రీ నాగేంద్ర దుర్గా దత్తసాయి సేవా సమితి సంస్థల సేవకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వెండి రథోత్సవం



స్వామిఅమ్మవార్లకు వెండి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రమైన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం వెండి రథోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

శ్రీశైలం చేరుకున్న డీజీపీ

శ్రీశైలంటెంపుల్: భారత ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 16న శ్రీశైలం పర్యటన నేపథ్యంలో బందోబస్తును పర్యవేక్షించేందుకు ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శ్రీశైలం చేరుకున్నారు. సోమవారం రాత్రి శ్రీశైలం చేరుకున్న డీజీపీ పోలీసు ఉన్నతాధికారులతో ప్రధాని పర్యటన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూంలో బందోబస్తుపై సమీక్షించారు.

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం పలు చోట్ల మోస్తరు వర్షం కురిసింది. బేతంచెర్ల మండలంలో అత్యధికంగా 50.2 మి.మీ, ఆళ్లగడ్డలో అత్యల్పంగా 0.8 మి.మీ వర్షం కురిసింది. డోన్‌లో 43.0, బనగానపల్లె 10.6, నంద్యాల రూరల్ 9.2, మహానంది 7.2, అవుకు 6.4, కొలిమిగుండ్ల 6.2, బండిఆత్మకూరు 6.0, నంద్యాల అర్బన్ 3.8, పాణ్యం 2.8, గోస్పాడు 2.0, గడివేముల 1.8మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షిద్దాం



మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్ రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షిద్దామని డీఈఓ జనార్దన్ రెడ్డి అన్నారు. ఇంటాక్ నంద్యాల చాప్టర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ సదస్సు స్థానిక గురురాజా పాఠశాలలో సోమవారం ప్రారంభమైంది. ఇంటాక్ సంస్థ నంద్యాల చాప్టర్ అధ్యక్షులు శివకుమార్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సదస్సులో డీఈఓ మాట్లాడుతూ భారతీయ కళలు సంస్కృతి వారసత్వ సంపద చాలా గొప్పవని, వాటి వైభవాన్ని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కో కన్వీనర్ సేతురామన్ గురురాజా స్కూల్ డైరెక్టర్ షావలి రెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

కొలువుదీరిన శ్రీశైల దేవస్థానం ట్రస్ట్‌బోర్డు



వేదికపై శ్రీశైల దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం ట్రస్ట్‌బోర్డు నూతన కమిటీ కొలువుదీరింది. ఇటీవల శ్రీశైల దేవస్థానానికి ధర్మకర్తల సలహా మండలి కమిటీని 17 మంది సభ్యులు, ఆరుగురు ప్రత్యేక ఆహ్వానితులను నియమిస్తూ జీవో జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ఉదయం చంద్రావతి కల్యాణ మండపంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులతో దేవస్థాన సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి హాజరయ్యారు. ముందుగా పోతుగంటి రమేష్‌నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. వరుసగా ఏవీ రమణ, బీ రవణమ్మ, జీ లక్ష్మీశ్వరి, కే కాంతివర్ధిని, ఎస్ పిచ్చయ్య, జే రేఖాగౌడ్, అనిల్‌కుమార్, దేవకి వెంకటేశ్వర్లు, బీ వెంకటసుబ్బారావు, జీ కాశీనాథ్, మురళీధర్, యు.సుబ్బలక్ష్మి, పీయూ శివమ్మ, జిల్లెల శ్రీదేవి ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణస్వీకారానికి చిట్టిబోట్ల భరద్వాజశర్మ, గుల్లా గంగమ్మ హాజరుకాలేదు. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులైన ఆరుగురిలో ముగ్గురు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం సభ్యులు పోతుగంటి రమేష్‌నాయుడుని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. చైర్మన్, సభ్యులందరికీ వేద పండితులు ఆశీర్వచనంతో పాటు, స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

సీనరేజ్ వసూలుకు అష్ట దిగ్బంధం

- పలు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన ప్రైవేట్ సంస్థ
- ఎగుమతి నిలిపివేసిన నాపరాతి పరిశ్రమ యజమానులు



బందార్లపల్లె క్రాస్ రోడ్డులో ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్

కొలిమిగుండ్ల: భూగర్భంలోనుంచి వెలికితీసే వివిధ రకాల ఖనిజాలకు ప్రభుత్వం సీనరేజ్ (రాయల్టీ) వసూలు చేసే బాధ్యత ప్రైవేట్ సంస్థకు అప్పగించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోటా పోటీలో వేలం దక్కించుకున్న సుధాకర ఇన్‌ఫ్రా సంస్థ కూటమి ప్రభుత్వానికి నెలకు రూ.14.05 కోట్ల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. నాపరాళ్లు (బ్లాక్‌స్టోన్) ఇతర ఖనిజాలను ట్రాక్టర్లు, లారీల్లో ఎగుమతి చేసేందుకు టన్నుల ప్రకారం సీనరేజ్ వసూలును ప్రవేట్ సంస్థ ప్రారంభించింది. కొలిమిగుండ్ల, అవుకు, మండలాల్లో పలు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఒక్క వాహనం తప్పించుకోకుండా అష్ట దిగ్బంధం చేశారు. ప్రతి చెక్‌పోస్ట్ వద్ద ప్రవేట్ సిబ్బందిని 24 గంటల పాటు పర్యవేక్షణ చేసేలా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, బైక్, జీపుల్లో పెట్రోలింగ్ చేసే టీంను ప్రత్యేకంగా నియమించారు. నాపరాళ్ల మైనింగ్‌లో వ్యర్థాలుగా మిగిలే గోడ రాళ్లకు కూడా సీనరేజ్ వసూలు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో భూగర్భ గనుల శాఖ అధికారులు రాయల్టీ వసూలు చేసేవారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడంతో ఓ సంస్థ రంగంలోకి దిగింది. గతంలో ట్రాక్టర్ రవాణా చేసేందుకు రాయల్టీకి రూ.600 మేర చెల్లించాల్సి వస్తుండేది. ప్రస్తుతం 18 శాతం జీఎస్టీతో కలిపి టన్నుకు రూ.222 వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్‌కు 5 టన్నులకు రూ.1,100 రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచన రాగానే అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాంతంలో మైనింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న కష్టాల గురించి వివరించారు. దీంతో యజమానులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆ ఆలోచనను విరమించుకుంది. కానీ కూటమి ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించకుండా ఇష్టారాజ్యంగా ప్రైవేట్‌కు అప్పగించడంతో యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన రవాణా

నాపరాళ్ల రవాణా ట్రాక్టర్లు, లారీలతో రద్దీగా ఉండే రహదారులు బోసిపోయి కనిపిస్తున్నాయి. మూడు రోజుల నుంచి రవాణా నిలిచిపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దినసరి కూలీ పనులు చేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు మండలాల్లో లారీ, ట్రాక్టర్లకు లోడింగ్ చేసే కార్మికులు సుమారు 1,500 మేర ఉంటారు. మూడు రోజుల నుంచి పనులు లేక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.



రాయల్టీ కోసం ట్రాక్టర్లను నిలిపిన దృశ్యం

ట్రాక్టర్ యజమానుల నిరసన..

బనగానపల్లె రూరల్: కూటమి ప్రభుత్వం రాయల్టీలను ప్రవేట్ పరం చేయడంతో ట్రాక్టర్ల యజమానులు నిరసన వ్యక్తం చేశారు. బీరవోలు సమీపంలో ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేసిన రాయల్టీ చెక్‌పోస్ట్ వద్ద ట్రాక్టర్ యజమానులు నాపరాతి గనుల్లోని వేస్ట్ మెటీరియల్‌ను ట్రాక్టర్లలో తీసుకొచ్చి రోడ్డుకు అడ్డంగా వేశారు. గతంలో నాపరాతి గనుల్లో వెలికితీసిన వేస్ట్ మెటీరియల్‌కు ప్రభుత్వానికి ఎటువంటి రాయల్టీ చెల్లించకుండా ఉచితంగా రవాణా చేసే వారమని, ప్రస్తుతం ఈ రాయల్టీ చెల్లింపు ప్రవేట్ వారికి ప్రభుత్వం అప్పగించడంతో వారు వేస్ట్ మెటీరియల్‌కు కూడా టన్నుకు సుమారు రూ.140 ప్రకారం చెల్లించాల్సి వస్తోందన్నారు. దాదాపు రెండు గంటల సేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.



వేస్ట్ మెటీరియల్‌ను రోడ్డుకు అడ్డంగా వేసిన దృశ్యం

క్లుప్తంగా

క్రేన్ ఢీకొని ఆల్కాలీస్ కూలీ మృతి


మృతిచెందిన చిన్నకుమార్

కర్నూలు: కర్నూలులోని శ్రీరామ టాకీస్ సర్కిల్ దగ్గర రోడ్డు దాటుతుండగా క్రేన్ ఢీకొని టి.చిన్న కుమార్ (46) మృతిచెందాడు. కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన చిన్న కుమార్ ఆల్కాలీస్ ఫ్యాక్టరీలోని సీఎంఎస్ ప్లాంట్‌లో కూలీగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. శ్రీరామ టాకీస్ దగ్గర ఉన్న అంజనేయస్వామి గుడిలో చెట్లకు మట్టి సంచిని తీసుకుని శ్రీరామ టాకీస్ సర్కిల్ మీదుగా రోడ్డు దాటుతుండగా ఏపీ39 ఎస్ఆర్ 5190 నెంబర్ గల క్రేన్ ఢీకొట్టింది. డ్రైవర్ దూద్ వలి అతి వేగంగా క్రేన్ నడుపుకుంటూ వెళ్తూ చిన్నకుమార్‌ను ఢీకొట్టడంతో కింద పడి అతనికి బలమైన గాయాలయ్యాయి. బంగారుపేట వీధిలో ఉన్న సమీప బంధువు లోకేష్ గుర్తించి 108 అంబులెన్స్‌కు సమాచారమివ్వడంతో వారు అక్కడికి వచ్చి చిన్నకుమార్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్యాజువాలిటీలో చికిత్స పొందుతూ కోలుకోలేక కొద్దిసేపటికే మృతిచెందాడు. ఇతనికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు సంతానం. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోలుకోలేక యువకుడి మృతి


వెంకటరమణ(ఫైల్)

నందికొట్కూరు: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు కోలుకోలేక సోమవారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మిడుతూరు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన నారాయణ, నారాయణమ్మ దంపతుల కుమారుడు వెంకటరమణ(18) ఇంటర్ వరకు చదువుకున్నాడు. ప్రస్తుతం పశువుల కాపరితోపాటు పొలం పనులు చేస్తూ కుటుంబానికి తోడుగా ఉంటున్నారు. హర్యానా గేదెలు కొనుగోలు చేసి కుటుంబాన్ని పోషిస్తానని, అందుకు రూ.2 లక్షల డబ్బు సమకూర్చాలని వారం రోజుల నుంచి తల్లిని కోరుతున్నా ఆమె స్పందించకపోవడంతో మనస్తాపానికి గురై ఈనెల 9న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట'మాట' పడిపోయింది!

- కిలో రెండు రూపాయలతో కొనుగోలు
- అందని గిట్టుబాటు ధర
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు


పత్తికొండకు రైతులు తీసుకొచ్చిన టమాట

పత్తికొండ: టమాటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పిన మాటలు ఉత్తివే అని తేలిపోయింది. వారు చెప్పిన మాటలకు మార్కెట్‌లో లభించే ధరకు పొంతన పొంతన లేదు. ప్రభుత్వ పెద్దలు చెప్పిన మాటలు విని వ్యాపారులతో మాట్లాడి మూణ్నాళ్ల ముచ్చటగా కొద్దిమేర ధరలు పెంచి టమాటాలను కొనుగోలు చేశారు. అనంతరం ధరలు తగ్గించి అన్నదాతలకు చుక్కలు చూపిస్తున్నారు. సోమవారం పత్తికొండ మార్కెట్‌కు 61 టన్నుల టమాటను రైతులు తీసుకొచ్చారు. అయితే మార్కెట్‌లో కిలో రూ. 1 నుంచి రూ.2 ప్రకారమే కొనుగోలు చేశారు. 15 కేజీల జత గంపలను రూ. 80 నుంచి రూ. 120 లోపు, 25 కేజీల జత గంపలను రూ. 100 నుంచి రూ.200 లోపు కొనుగోలు చేశారు. గిట్టుబాటు ధర కోసం వారం రోజుల కిందట రైతులు రోడ్డు ఎక్కి ఆందోళన చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు రోజులు పాటు ఉన్నత స్థాయి అధికారులు మార్కెట్‌లో హడావిడి చేశారు. అప్పట్లో కిలో రూ. 6 నుంచి రూ. 8 లోపు కొనుగోలు చేశారు. అయితే శనివారం రోజు నుంచి ధరలు తగ్గించుకుంటూ వచ్చారు. సోమవారం ఉన్నట్టుండి కిలో రెండు రూపాయలలోపు కొన్నారు. మాట తప్పడంపై రైతులు మండిపతున్నారు. మార్కెట్‌కు వచ్చిన టమాటలో నాణ్యత లేదనడంలో వాస్తవం లేదని, వానల్లేక చాలా నాణ్యతగా ఉందని రైతులు చెబుతున్నారు. గిట్టుబాటు ధరతో ఎందుకు కొనడం లేదని ప్రశ్నిస్తున్నారు.

నిర్లక్ష్యం.. అలసత్వం

పత్తికొండ మార్కెట్‌ను వారం కిందట కడప రీజనల్ డైరక్టర్ లావణ్య, కర్నూలు ఏడీ ఆదినారాయణ సందర్శించారు. గిట్టుబాటు ధరపై రైతులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో ధర తగ్గినప్పుడు గిట్టుబాటు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. అంతే కాదు ఆదనంగా ప్రత్యేక అధికారి పద్మావతితో పాటు ఆదోని, ఎమ్మిగనూర్ మార్కెట్‌యార్డుల నుంచి ఐదుగురు సిబ్బందిని కూడా నియమించారు. సిబ్బంది ఎక్కువగా ఉండటంతో మార్కెట్‌లో ధర తగ్గితే తామే కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ప్రభుత్వం నిర్లక్ష్యధోరిణి, అధికారుల అలసత్వం రైతులకు శాపంగా మారింది.

కూలి పనులకు పోవడం మేలు



వ్యవసాయం చేసుకోవడం కంటే కూలీపనికి పోవడం మేలు. ఈఏడాది రెండు ఎకరాల్లో టమాటను సాగు చేశాను. రూ. 80వేలు పెట్టుబడి కోసం ఖర్చు చేశాను. 56 గంపలు మార్కెట్‌కు తీసుకొచ్చాను. జత గంపలు 100 రూపాయలకు కొనుగోలు చేశారు. కూలీలు, రవాణా కోసం రూ. 2వేలు ఖర్చు అయ్యింది. ఈఏడాది ఒక్కసారి కూడా మంచి రేటుకు అమ్ముకోలేదు.

– నాగరాజు, ఆర్ కొత్తూరు

ప్రభుత్వం స్పందించడం లేదు



టమాట రైతుల కష్టాలపై ప్రభుత్వం స్పందించడం లేదు. నేను రెండు ఎకరాల్లో సాగు కోసం రూ. 80 వేలు దాకా ఖర్చు చేశాను. ఇప్పటివరకు పైసా కూడా చేతికందలేదు. ఈ రోజు 30 గంపలు తెచ్చాను. జత 120 రూపాయలు లెక్క కొన్నారు. వ్యాపారులు కమీషన్ పట్టుకొని ఇస్తారు. 8 మంది కూలీలు టమాటలను తెంపినారు. ఆటో బాడుగ రూ. 600 ఇచ్చాను. వచ్చిదంతా వాళ్లకే సరిపోతుంది. రైతుకు ఏమీ మిగలడం లేదు.

– రవి, రాతన

గిట్టుబాటు ధరలేక ఉల్లి పంట తొలగింపు


ఉల్లి పంటను ట్రాక్టర్‌తో తొలిగిస్తున్న దృశ్యం

తుగ్గలి: మార్కెట్‌లో ఉల్లిగడ్డలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రాతన గ్రామానికి చెందిన రైతు ఏటిగడ్డ వెంకప్ప సోమవారం పంటను ట్రాక్టర్ పల్టర్‌తో దున్నేశారు. ఏడెకరాలలో సుమారు రూ.4 లక్షలకు పైగా పెట్టుబడి ఉల్లి పంట సాగు చేస్తే ఇప్పుడు కొనేవారు లేరని రైతు వాపోయారు. ఇప్పుడు పంటకోసి గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తీసుకెళ్లాలంటే మరో రూ.2లక్షల దాకా అవుతుందని, క్వింటాకు ఐదారు వందలకు మించి ధర లేదన్నారు. ఇంత ఖర్చుచేసినా కూలీల ఖర్చులు కూడా రావని దున్నేశానని చెప్పారు. క్వింటా ధర రూ.3వేల నుంచి రూ.4వేలు ఉంటేనే గిట్టుబాటు అవుతుందన్నారు. ప్రభుత్వం హెక్టారుకు రూ.50వేలు పరిహారం ఇచ్చి ఆదుకుంటామని చెప్పినా ఇంత వరకు ఇవ్వలేదన్నారు.

మోదీ పర్యటన ఏర్పాట్లు చకచక

- నున్నిపెంటలో ఆరు హెలిపాడ్‌లు సిద్ధం
- నల్లమలలో కొనసాగుతున్న గ్రేహౌండ్స్ కూంబింగ్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు


నల్లమలలో కూంబింగ్ చేస్తున్న గ్రేహౌండ్స్ బృందం

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీన శ్రీశైలం పర్యటన సందర్భంగా సున్నిపెంటలో ఏర్పాట్లు చకచక జరుగుతున్నాయి. పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు, విద్యుత్, అటవీ, ఐటీడీఏ, దేవదాయ, కేంద్ర, రాష్ట్ర పోలీసు, ఇతర శాఖల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. సున్నిపెంటలోని ఎకలాజికల్ పార్క్‌లో ఇప్పటికే శాశ్వత హెలిపాడ్‌లు మూడు ఉన్నాయి. ప్రధాని మోదీ వెంట మూడు హెలికాప్టర్లు వస్తుండడంతో ఆ హెలిపాడ్‌లను మరింత పటిష్ట పరుస్తున్నారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇతర మంత్రుల కోసం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మరో మూడు తాత్కాలిక హెలిపాడ్‌లను నిర్మిస్తున్నారు. విద్యుత్ లైన్ల కింద, ప్రధాన రహదారికి ఇరు వైపుల చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. ఇప్పటికే ఇంటలిజెన్స్, బాంబ్‌స్క్వాడ్, గ్రేహౌండ్స్ బలగాలు శ్రీశైలం పరిసర ప్రాంతాలను తనిఖీ చేస్తున్నాయి. ప్రధాని పర్యటన విధులకు వచ్చే అధికారులు, ఉద్యోగులకు సదుపాయాలను కల్పిస్తున్నారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా సాధారణ ప్రయాణికుల రాకపోకలకు, సౌకర్యాలకు ఇబ్బందులు కలిగే పరిస్థితి ఉన్నందున అత్యవసరమైతే తప్ప భక్తులు, యాత్రికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

హాస్టల్ నుంచి వెళ్లి తిరిగి వచ్చిన విద్యార్థులు


ఉదయం హాస్టల్ నుంచి వెళ్లిన విద్యార్థులు

పత్తికొండ: ఉపాధ్యాయులకు చెప్పకుండా హాస్టల్ నుంచి వెళ్లిపోయిన ఇద్దరు విద్యార్థులు తిరిగి మళ్లీ వచ్చారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. పత్తికొండ పట్టణంలోని పుచ్చకాయల మాడ గ్రామ రహదారిలో ఉన్న బాలురు గురుకుల పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థులు దనుష్, ప్రణీత్‌లు ఉదయం హాస్టల్ నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయారు. రోల్‌కాల్ సమయంలో వ్యాయామ ఉపాధ్యాయుడు గుర్తించి పిల్లల లేరన్న విషయంపై ప్రిన్సిపాల్‌కు తెలిపారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో తప్పిపోయిన విద్యార్థులు వివరాలతో ఫొటోలతో పాటు ఫోన్ నంబర్లను ఇచ్చి సోషల్‌మీడియాలో ప్రచారం చేశారు. ఆస్పరి మండలం బిల్లేకల్ గ్రామం దగ్గర ఎమ్మిగనూర్ వైపు నడుచుకుంటూ వెళ్లుతున్న విద్యార్థులను స్థానికులు గుర్తించారు. వారినే అక్కడ ఉంచుకుని గురుకుల పాఠశాల సిబ్బందికు సమాచారం ఇచ్చారు. ఉపాధ్యాయులు అక్కడికి చేరుకొని విద్యార్థులను గురుకుల పాఠశాలకు తీసుకోచ్చారు. దాదాపు రెండు గంటల వ్యవధిలోనే 20 కిలోమీటర్లు దూరం పైగా నడుచుకుంటూ వెళ్లారు. సోషల్ మీడియాలో వారి ఫొటోలు చూసి గుర్తుపట్టి విద్యార్థులను గురుకుల పాఠశాల సిబ్బంది, తల్లితండ్రులకు అప్పచేప్పడంతో కథ సుఖాంతమైంది.

డ్రోన్ల ఎగురవేత నిషేధం


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

కర్నూలు: ప్రధాని మోదీ పర్యటన పరిసర ప్రాంతాల్లో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు డ్రోన్ల ఎగురవేతపై జిల్లా పోలీసు శాఖ నిషేధం విధించింది. బహిరంగ పరిసర ప్రాంతాల్లో దాదాపు 200 పైగా సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. పీఎం పర్యటన బందోబస్తు నిమిత్తం వచ్చిన అడిషనల్ ఎస్పీ స్థాయి నుంచి ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులకు కర్నూలు శివారులోని పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని యాబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో పోలీసు అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ప్రధానమంత్రి బహిరంగ సభకు వచ్చి వెళ్లే సమయంలో బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులు ఫొటోలు, వీడియోలు తీయరాదన్నారు. డీజీపీ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాల నిఘా ఉంటుందని, అందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. అనుమానితులు కనిపిస్తే పైఅధికారులకు వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ట్రైనీ ఐపీఎస్‌లు, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు సమావేశంలో పాల్గొన్నారు.

రూ. 1.60 కోట్లతో దేవాలయాల పునర్నిర్మాణం


పూజల్లో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్, అర్చకులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రం వద్ద ఆంజనేయస్వామి, బసవన్న అలయాలను 1.60కోట్లతో పునర్నిర్మాణం చేస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. సోమవారం వేదపండితులు, అర్చకులు పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోతట్టులో ఉండడంతో బసవన్న గుడిని రూ. 43లక్షలతో, ఆంజినేయస్వామి ఆలయాన్ని రూ. 1.15కోట్లతో పునర్నిర్మిస్తున్నట్లు చెప్పారు. వేద పండితుడు మురళికృష్ణపండిత్, ప్రధాన, ఉపప్రధాన అర్చకులు ఈరప్పస్వామి, మహదేవస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో రాష్ట్ర హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో మంగళవారం నుంచి మూడు రోజులపాటు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్ చౌదరి, ఎం.వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయవాదుల అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వ తీరుతో కర్నూలుకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): తపాల జీవిత బీమా, గ్రామీణ తపాల బీమాలో డైరెక్ట్ ఏజెంట్లుగా కర్నూలు డివిజన్‌లో పనిచేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తపాల శాఖ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకునే వారు 18 సంవత్సరాలు పైబడి, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎంపికైన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.5 వేలు ఎన్ఎస్‌సీ రూపంలో చెల్లించాలన్నారు. పాలసీలకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కమీషన్ చెల్లిస్తామన్నారు. మరిన్ని వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్‌ను 7013029312 నెంబర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎస్టీ జాబితాపై వాల్మీకులకు స్పష్టత ఇవ్వాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర నాయుడు

- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర నాయుడు

కర్నూలు (టౌన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని 2017లో సీఎం చంద్రబాబు, 2019లో ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని, వెంటనే స్పష్ట ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర నాయుడు అన్నారు. కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాత్రమే ఎన్‌డీఏ ప్రభుత్వానికి, ఆ పార్టీలకు వాల్మీకులు గుర్తుకొస్తారన్నారు. ఇప్పుడు కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఉందని వెంటనే వాల్మీకులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఈనెల 16న కర్నూలులో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ గతంలో వాల్మీకులకు ఇచ్చిన హామీపై స్పష్టంగా ప్రకటించాలన్నారు. ఏళ్ల తరబడి వాల్మీకులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. బీసీల జపం చేసే చంద్రబాబు నాయుడు వాల్మీకులకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా న్యాయం చేశారా? అని ప్రశ్నించారు. వాల్మీకులకు న్యాయం జరిగేంతవరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేసేందుకు సిద్ధమైందన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, యువజన విభాగం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, వాల్మీకి యూత్ ప్రెసిడెంట్ నాయుడు, బండిమెట్ట మధు, అశోక్, లక్ష్మన్న, జగన్ పాల్గొన్నారు.

సేవలను మరచిపోలేం


దుర్గా ప్రసన్నబాబును సత్కరిస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధకశాఖలో కర్నూలు డివిజన్ డీడీగా పనిచేస్తూ జేడీగా పదోన్నతి పొంది డైరెక్టరేట్‌కు బదిలీ అయిన డాక్టర్ దుర్గాప్రసన్నబాబును సోమవారం కర్నూలులోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలో సన్మానించారు. ఉమ్మడి జిల్లాకు 2005 నుంచి డాక్టర్ దుర్గాప్రసన్నబాబు అందించిన సేవలను ఎప్పటికీ మరచిపోలేమని అన్నారు. కర్నూలు, ఆదోని డీడీలు హేమంత్‌కుమార్, వెంకటరమణ, ఏడీలు డాక్టర్ నాగరాజు, భవానిశంకర్‌రెడ్డి, ధనుంజయుడు, పార్థసారిథి, వెటర్నరీ అసిస్టెంటు సర్జన్స్ అసోషియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఇతర నాయకులు గిడ్డయ్య, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై చింతకొమ్మదిన్నె మెట్ట సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జయచంద్రారెడ్డి (37) మృతి చెందాడు. వైఎస్సార్ జిల్లా రాజుపాలెం మండలం గాదెగూడూరు గ్రామానికి చెందిన జయచంద్రారెడ్డి మోటర్ సైకిల్‌పై ఆళ్లగడ్డ నుంచి సొంత ఊరుకు బయలు దేరారు. చింతకొమ్మదిన్నె మెట్ట సమీపంలోకి వెళ్లే సరికి అదుపుతప్పి జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో జయచంద్రారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

యువకుడి దుర్మరణం


మృతి చెందిన దూదేకుల సుబ్బరాయుడు

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పాంపల్లె రస్తాలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉయ్యాలవాడ మండలం పాంపల్లె గ్రామానికి చెందిన దూదేకుల సుబ్బరాయుడు సొంత పనుల మీద సోమవారం బైక్‌పై ఆళ్లగడ్డకు చేరుకున్నాడు. పనిముగించుకుని రాత్రి సొంతూరుకు బయలుదేరగా మార్గమధ్యలో చింతకుంట రోడ్డు – పాంపల్లె దారిలో అదుపు తప్పి కేసీ కెనాల్ బ్రిడ్జిను ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సుబ్బరాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

సలహాలేనా.. సౌకర్యాలు కల్పిస్తారా?

- నూతనంగా ఏర్పాటైన ధర్మకర్తల సలహా మండలి
- శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌కు సమస్యల స్వాగతం


శ్రీశైల ఆలయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి నూతన ధర్మకర్తల సలహా మండలిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో సోమవారం ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్‌గా పోతుగంటి రమేష్ నాయుడిని ఎన్నుకున్నారు. అయితే దేవస్థాన ప్రస్తుత ధర్మకర్తల సలహా మండలి కేవలం భక్తులకు అవసరమైన సౌకర్యాలపై సలహాలు మాత్రమే ఇవ్వగలదు. దేవస్థాన ఈఓ, దేవదాయశాఖ కమిషనర్ చైర్మన్, సభ్యులు ప్రతిపాదించిన సమస్యలను అనుమతించవచ్చు లేక తిరస్కరించవచ్చు. ప్రతి ప్రతిపాదనకు దేవదాయ శాఖ కమిషనర్ అనుమతి తప్పనిసరి.

సౌకర్యాలు కల్పించాలి.. మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి

శ్రీశైల దేవస్థాన చైర్మన్‌గా ఎన్నికైన నూతన చైర్మన్ శ్రీశైల దేవాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ఇక్కడికి అనేక రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. శ్రీశైల క్షేత్రంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా అనేక సంస్కరణలు తీసుకురావాల్సి ఉంది. భక్తుల రద్దీని అంచనా వేసి రూ.1657.28కోట్ల అంచనాలతో గతంలోనే మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేశారు. దీని అమలు విషయంపై ప్రభుత్వం, దేవదాయశాఖ అధికారుల అనుమతులు తీసుకురావాల్సి ఉంది.

దేవస్థాన భూములు దక్కేనా?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేవదాయ, రెవెన్యూ, అటవీశాఖ మంత్రులతో, ఉన్నతాధికారులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేసింది. వారంతా పరిశీలించి 4,500ఎకరాల భూమి శ్రీశైల క్షేత్రానికి చెందినదని గుర్తించారు. అటవీ, రెవెన్యూ, దేవదాయశాఖల సమన్వయంతో ల్యాండ్ అండ్ సర్వే అధికారులు సరిహద్దులను సైతం గుర్తించారు. అటవీశాఖ నుంచి ఎటువంటి అడ్డంకులు లేకుండా దేవస్థాన భూములను తిరిగి దేవస్థానానికి దక్కేలా తీర్మానాలు చేసి అగ్రిమెంట్ సైతం చేసుకున్నారు. అయితే కేంద్ర అటవీశాఖ అధికారులు భూమిని బదిలీ చేసేది లేదని తిరస్కరించినట్లు సమాచారం. అటవీశాఖ అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి క్షేత్ర భూమి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమన్వయం అవసరం

శ్రీశైల దేవస్థాన ఈఓ, ఆయా విభాగాల అధికారులతో అలాగే ధర్మకర్తల మండలి సభ్యులతో సమన్వయం అతి ముఖ్యమైనది. భక్తుల సమస్యలపై, సౌకర్యాల కల్పన విషయంలో అధికారుల బృందంతో, పాలక మండలి సభ్యులతో సామరస్యంగా వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులు, సభ్యులతో బేధాభిప్రాయాలు లేకుండా ట్రస్టబోర్డు సమావేశాలు సాగేలా చూసుకోవాలి. అధికారులు, సభ్యులు అందరిని సమన్వయం చేసుకుని వెళితే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించవచ్చు.

చేయాల్సిన పనులు ఇవీ..

- శ్రీశైల దేవస్థానంలో రెగ్యులర్ ఉద్యోగులు ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఏళ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తుండడంతో అక్రమాలకు అవకాశం ఉంది. ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీ చేయాలి.
- సాధారణ బదిలీలలో భాగంగా ఇతర దేవస్థానాలకు బదిలీ అయిన ఉద్యోగులు డిప్యుటేషన్ పేరుతో శ్రీశైల దేవస్థానానికి చేరుకుని తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. డిప్యుటేషన్‌పై ఉన్న ఉద్యోగులను వారి వారి దేవస్థానాలకు బదిలీ చేయాలి.
- రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు డయల్ యువర్ ఈఓ కార్యక్రమాన్ని నిర్వహించాలి.
- శ్రీశైలం ముఖద్వారం నుంచి టోల్‌గేట్ వరకు రోడ్డును వెడల్పు చేయాల్సి ఉంది.
- సాక్షిగణపతి ఆలయం వద్ద పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- పాలధార-పంచధార వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. తద్వారా నిషేధిత పదార్థాలు, వస్తువులు క్షేత్రంలోకి రాకుండా లగేజ్ స్కానర్స్, వెహికల్ స్కానర్స్ ఏర్పాటు చేయాలి.
- సామాన్య భక్తులు సైతం వసతి పొందేలా తక్కువ ధరకు వసతి గదులు అందుబాటులో ఉండేలా వసతి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.
- డార్మెంటరీలు ఎక్కువ నిర్మించాల్సిన అవసరం ఉంది.
- టీటీడీ తరహాలో దర్శన టికెట్ల సేవా రుసుంను కూడా తగ్గించాలి.
- క్షేత్ర పర్యటనకు వచ్చిన భక్తులు రెండు రోజుల పాటు క్షేత్రంలోనే బస చేసి ఆధ్యాత్మిక అనుభూతి పొందేలా సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.
- శ్రీశైలక్షేత్రంలో విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌ను నియమించ లేదు. దీంతో క్షేత్రంలో అనేక అవినీతి కార్యక్రమాలకు అధికారులు పాల్పడుతున్నారు. గతంలో సుమారు రూ.2కోట్లకు పైగా టికెట్ల కుంభకోణం, పెట్రోల్‌బంక్ కుంభకోణం, టికెట్ల రీస్కెకింగ్ తదితర అవినీతి కార్యక్రమాలు జరిగాయి.
- శ్రీశైల దేవస్థానంలో లడ్డూప్రసాదాలు, నైవేద్య ప్రసాదాలు, అన్నప్రసాద వితరణకు మొదలైన వాటికి వినియోగించే పడితరంకు సరఫరా చేసే నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించేందుకు ల్యాబ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. వస్తువుల నాణ్యత పరిశీలించే ల్యాబ్ లేకపోవడంతో సదరు కాంట్రాక్టర్ నాణ్యత లేని వస్తువులను సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- సామాన్య భక్తుల సౌకర్యార్థం గత పాలకమండలి తెల్లరేషన్ కార్డు కలిగిన సామాన్య భక్తులకు ఉచిత ఆర్జిత సేవల్లో పాల్గొనేలా అవకాశం కల్పించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆ పథకం అమలు అటకెక్కింది. ఈ పథకాన్ని పునరుద్ధరించాలి.